ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 19 జనవరి 2025



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- వాడవాడలా అన్నదానాలు.. రక్తదానాలు
- సంక్షేమ పథకాల రూపకర్తని కొనియాడిన నేతలు
- తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటారన్న మంత్రి అనగాని



జాగర్లమూడి వారిపాలెంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి తదితరులు

ఎన్టీఆర్‌కు.. ఘననివాళులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు.. మాజీ ముఖ్యమంత్రి.. స్వర్గీయ నందమూరి తారకరామారావుకు జిల్లావ్యాప్తంగా శనివారం ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానుల నుంచి సామాన్య ప్రజల వరకు ఘనంగా నివాళులర్పించారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలను సుందరంగా అలంకరించిన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక ప్రధాన కూడళ్లలో ఎన్టీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున అన్నదానాలు చేశారు. కొన్ని దగ్గర్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయగా టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. రక్తదానం చేసిన వారిని నేతలు ప్రత్యేకంగా అభినందించారు. పారిశుధ్య కార్మికులకు, పేదలకు నేతలు దుస్తులు పంపిణీ చేశారు. అద్దంకి మండలం శింగరకొండపాలెం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ నివాళులు అర్పించారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, వేమూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొనగా, పాత చీరాలలో ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఏరియావైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అమృతలూరు మండలంలోని కూచిపూడిలో నక్కా ఆనందబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు అన్నదానం చేశారు. అల్లూరులో పార్టీ నాయకులు నిరుపేదలకు కూరగాయలు పంపిణీ చేశారు.



రేపల్లె: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నాయకులు

● రేపల్లెలో ఉప్పూడిరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఎన్టీఆర్ తెలుగుజాతికి ఆత్మగౌరవం నింపితే చంద్రబాబు ఆత్మ విశ్వాసం నింపారన్నారు. తెలుగు జాతి గౌరవం ప్రపంచ నలుమూలలకు తెలిసేలా కృషి చేశారన్నారు. రైల్వే స్టేషన్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వవైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

- పారిశుధ్య నిర్వహణపై క్రమశిక్షణ అవసరం
- స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్‌లో పవన్‌కల్యాణ్
- నంబూరులో చెత్త సంపద సృష్టి కేంద్రం పరిశీలన
- 35 మంది స్వచ్ఛ కార్మికులకు ఉపముఖ్యమంత్రి సత్కారం
- చెత్త రవాణా వాహనం ప్రారంభించి, స్వయంగా నడిపిన పవన్‌కల్యాణ్

చెత్త పునర్వియోగంతో సంపద

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛత విషయాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలి. చెత్తే కదా.. ఏం చేస్తాం అని కాకుండా.. దాని నుంచి సంపద సృష్టించాలి. శుభ్రత, స్వచ్ఛత ప్రజల జీవన విధానంలో ఓ భాగం కావాలి. పరిసరాల శుభ్రత.. స్వచ్ఛత పరిరక్షణకు అందరూ కృషి చేయాలి.' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద శనివారం మొక్కను నాటి 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత గ్రామ స్థాయిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం చెత్త సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, శానిటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరికరాల పనితీరు గురించి అధికారులను ప్రశ్నించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తతో పాటు విష పూరిత వ్యర్థాలను వేరు చేసేందుకు ఇంటికి మూడు బుట్టలు ఇస్తున్నట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు చూపారు. చెత్త నిర్వహణలో ఉపయోగించే పరికరాల పనితీరుని తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రామాల వివరాలు, సంపద సృష్టి కేంద్రాల సహకారంతో పండించిన పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకించారు. అనంతరం చెత్త రవాణా వాహనాన్ని ప్రారంభించి, ట్రాక్టర్ నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అందరూ పాటించినట్లుగా పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత విషయంలో క్రమశిక్షణ మళ్లీ రావాలన్నారు. చెత్తను పునర్వియోగం చేసుకునేలా ఇంట్లోనే వేరు చేయాలన్నారు. చెత్త ద్వారా విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీకి స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రారంభమైందని, ప్రతి నెల మూడో శనివారం నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు.



పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పక్కన మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యం

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యమైనవని పవన్‌కల్యాణ్ తెలిపారు. వారిని గౌరవించుకోవడం ప్రజలందరి బాధ్యతన్నారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ఎంతో కష్టపడి పని చేసి, ప్రజల మన్ననలు అందుకున్న 35 మంది పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ప్రతి ఒక్కరిని పేరు పేరున పలకరిస్తూ, శాలువా కప్పి నూతన వస్త్రాలు, పండ్లు బహూకరించారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ట్రెక్కింగ్...

6



కొండపల్లి కోటపై ట్రెక్కింగ్ చేస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- పండగకు 250పైనే ఏర్పాటు
- రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
- ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం



జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి

8



6

విశాఖకు రూ.11వేల కోట్ల ప్యాకేజీ శుభపరిణామం

మంత్రి అనగాని సత్యప్రసాద్

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ **రైళ్ల రద్దు**

నేడు, రేపు పలు **ప్రత్యేక రైళ్లు**

త్రిసభ్య కమిటీలు.. సహకార సంఘాల పాలకవర్గాలుగా నియమితులు కానున్నాయి. ఎన్నికలు జరిగే వరకు వారిదే అధికారం. ఆయా కమిటీలపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు కల్లా కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కొక్క సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరిని, సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాలి. ఈ బాధ్యతలను పార్టీ అధిష్ఠానం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలకు అప్పగించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పేర్లను సేకరిస్తున్నారు. కమిటీల్లో పదవుల కోసం కూటమి నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సొసైటీల వారీగా పేర్లను ఖరారు చేయడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది.

- 168 సహకార సంఘాలకు నియామకం
- నెలాఖరుకు ఏర్పాటు కానున్న కమిటీలు
- సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జి, ఇద్దరు సభ్యులు
- ఎన్నికల వరకు త్రిసభ్య కమిటీలకే అధికారాలు
- పదవుల కోసం నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- నియోజకవర్గాల వారీగా రూపొందుతున్న జాబితాలు

కమిటీలపై కసరత్తు



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 168 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సొసైటీల బాధ్యతలను త్రిసభ్య కమిటీలకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే వరకు త్రిసభ్య కమిటీలను కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీల బాధ్యతలను పర్సన్ ఇన్‌చార్జ్‌లకు అప్పగించింది. అయితే పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలతో నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ప్రభుత్వ నిర్ణయంపై సొసైటీ పదవులు ఆశించిన నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం తన నిర్ణయంలో మార్పు చేసి త్రిసభ్య పాలనకు సిద్ధమైంది. దీంతో పదవులు ఆశిస్తున్న నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీల వారీగా కమిటీల కోసం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని సొసైటీలకు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇటువంటి వాటికి ఆ పరిధిలోని మెజార్టీ నేతల అభిప్రాయంతో పేర్లను ఖరారు చేస్తున్నారు.

504 మందికి పదవులు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకంతో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు నామినేటెడ్ పదవుల పండుగ నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 504 మంది నేతలకు పదవులు లభించనున్నాయి. పార్టీ కోసం కష్టపడటంతో పాటు వైసీపీ హయాంలో తీవ్రంగా నష్టపోయిన వారికి ఆయా పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని నేతలు కోరుతున్నారు.

అన్నీ చక్కదిద్దాకే ఎన్నికలు..

నిబంధనలకు విరుద్ధంగా సహకార సంఘాల్లో పార్టీ కార్యకర్తలను వైసీపీ నేతలు సభ్యులుగా చేర్చారు. సొసైటీల ఓటర్ల జాబితాల్లో పెద్దఎత్తున అవతవకలు ఉన్నట్లు కూటమి నేతలు

(మిగతా 8వ పేజీలో)

అయ్యో.. అంబటి

- రాంబాబుకి సీటు హుళక్కేనా?
- సత్తెనపల్లి ఇన్‌చార్జిగా డాక్టర్ గజ్జల
- గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలకే పరిమితం
- పశ్చిమ సీటు ఆశించగా నిరాకరించిన జగన్
- సొంత నియోజకవర్గం రేపల్లే ఇక దిక్కా!



గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఉండదా అంటే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అవునంటు న్నాయి. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా ఉన్న ఆయనను ఇటీవల పక్కన పెట్టి గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో గుంటూరు పశ్చిమ సీటు ఆశించగా పార్టీ అధినేత జగన్ నిరాకరించారు. ఈ పరిస్థితుల్లో ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీపై అనుమానాలు నెలకొన్నాయి. 2019 ఎన్నికల్లో అంబటి సత్తెనపల్లి నుంచి అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెలపై విజయం సాధించి అమాత్య పదవిని దక్కించుకు న్నారు. అయితే నియోజకవర్గంలో వైసీపీకి ప్రధానంగా కొమ్ముకాసే ఓ సామాజిక వర్గం ఆయన తీరును తొలి నుంచి వ్యతిరేకిస్తూనే వచ్చింది. ఒక దశలో ఆయనకు తిరిగి టికెట్ ఇవ్వకుండా అడ్డుకునేందుకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, నలంద విద్యా సంస్థల అధినేత వరప్రసాదరెడ్డి తీవ్రంగా ప్రయత్నిం చారు. అయితే తన వాగ్ధాటితో నిత్యం టీడీపీపై బురద జల్లడంలో రాంబాబుది అందె వేసిన చేయి కావడంతో జగన్ అంబటి అభ్యర్థిత్వానికే మొగ్గు చూపారు. 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన అంబటిని పదోన్నతి పేరుతో గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ సత్తెనపల్లి నుంచి ఉద్వాసన చెప్పారు. అంతే గాకుండా రెండు, మూడు రోజుల క్రితం సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డికి అప్పగిస్తూ జగన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో అంబటికి సత్తెనపల్లి ద్వారాలు మూసుకుపోయాయి. కాగా అంబటికి గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సమయం లోనే గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి విడదల రజినికి చిలకలూరిపేట బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు గుంటూరు పశ్చిమ బాధ్యతలు అప్పగిస్తారని అంబటి ఆశించారు. ఈ క్రమంలో తనకు పశ్చిమ బాధ్యతలు అప్పగించాలని జగన్‌ను అంబటి కోరినా దాట వేసినట్లు సమాచారం. టీడీపీ కంచుకోటగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో కొత్త ప్రయోగం చేసే ఉద్దేశంలో జగన్ ఉన్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. తరచూ వివాదాస్పదంగా వ్యాఖ్యలు చేసే అంబటికి పశ్చిమలో అంత అనుకూల వాతావరణం కూడా ఉండదనే భావన ఆ పార్టీ నేతల్లో ఉంది. పైగా ఇదే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాలనే ఆశలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఉన్నారు. చిలకలూరిపేట పగ్గాలు రజినికి అప్పగించడంతో గత ఎన్నికల్లో పోటీ చేసిన మనోహర్‌కు ఆ నియోజకవర్గంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ పరిస్థితుల్లో అంబటికి తిరిగి తన సొంత నియోజకవర్గమైన రేపల్లె నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారనే వాదన వినిపిస్తున్నది. లేదంటే ఆయన్ను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంచి, పార్టీ పరంగా ఉపయోగించుకునే ఆలోచన జగన్‌కు ఉందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

తెలుగు జాతి హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



ఎన్టీఆర్‌కు గ్రంథాలయ వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి హృదయాల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ లైబ్రరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు, మహిళలకు సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. తెలుగు సినీ పరిశ్రమలో గొప్ప నటుడిగా ప్రతి పాత్రకు జీవం పోసి, ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారన్నారు. ప్రజలతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమని, అందరూ ప్రేమించే నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఏఎన్‌యూ మహిళా క్రికెట్ జట్టు

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మైసూర్‌లో జరిగే ఈ పోటీలకు జట్టును ఎంపిక చేసినట్లు వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు దగ్గర నుంచి ఇప్పటి వరకు మహిళల క్రికెట్ జట్టును ఎంపిక చేయలేదనీ, మొట్టమొదటిసారిగా ఈ ఏడాది ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ జట్టు 20వ తేదీ వరకు వర్సిటీలో శిక్షణ పొంది అనంతరం మైసూర్ వెళ్లనుందని పేర్కొన్నారు. జట్టు మేనేజర్‌గా సాధన డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జె.ప్రేమ్ కుమార్, కోచ్‌గా ఫిరంగిపురంలోని సెయింట్ జేవీయర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఫిజికల్ డైరెక్టర్ కె.మోజెస్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వర్సిటీ నుంచి మహిళల జట్లను ఎంపిక చేయటంపై వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

అమృతలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైతు ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పాంచాళవరం గ్రామానికి చెందిన ఘంటా మదన్‌మోహనరావు (75) వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంత కాలంగా గూడవల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పాంచాళవరం తన ట్రాక్టర్‌పై వచ్చి తమ పొలంలోని మినుము పైరును తడుపుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ఆయన నడుపుతున్న ట్రాక్టర్ పంట కాల్వలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ కింద ఆయన పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎన్నారైలు ముందుకు రావాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



స్కూల్‌ను ప్రారంభిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి, దాత సుధాకర్, సర్పంచి పవన్‌కుమార్

తెనాలి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాతృభూమి రుణం తీర్చుకునేలా ఎన్నారైలు ముందుకు రావాలని, సొంత గ్రామంలో విద్యాలయం నిర్మాణానికి ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి దంపతులు చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నంది వెలుగు గ్రామంలో ప్రభుత్వ, దాతల సహకారంతో జడ్పీహెచ్ఎస్ స్కూల్ నూతన భవనం, ప్లే గ్రౌండ్, ప్రహరీ, క్లాస్ రూమ్‌ల తదితర మౌలిక వసతుల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దాతలు ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో పిల్లల చదువుకు అవసరమైన మౌలిక వసతులతో స్కూల్ భవనాన్ని తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఎన్నారై ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యామ్ ప్రసాద్, ఇతర దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నారైగా స్థిరపడినా, ధూళిపాళ్ల సుధాకర్ తాను చదివిన స్కూల్ దుస్థితిలో ఉండటాన్ని గుర్తించి దాని అభివృద్ధికి రూ. లక్షల ఖర్చు చేసి తీర్చిదిద్దడం గొప్పవిషయమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నారైగా సుధాకర్ మేము సైతం టీం ద్వారా గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దాత సుధాకర్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలని తన కుటుంబ సభ్యులకు సైతం ఎప్పటికప్పుడు చెబుతూ, దానిని ఆచరణలోకి తీసుకువచ్చామన్నారు. గ్రామ సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, దాతల సహకారంతో మేముసైతం టీం పర్యవేక్షణలో స్కూల్ భవనాన్ని ఇతర మౌలిక వసతుల కల్పనకు ముందుకు వచ్చామన్నారు. తొలుత అతిథులకు ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాగతం పలికారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, బి.సురేంద్ర, విజయలక్ష్మి, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతి బాబు, నన్నపనేని లింగారావు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ రైళ్ల రద్దు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల దృష్ట్యా ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు(28వ తేదీ) వరకు రెండు మెమూ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67769 విజయవాడ - గుంటూరు, నంబరు. 67770 గుంటూరు - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు పలు ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండగ సెలవులు ఆదివారంతో ముగియనుండటంతో రైళ్లలో రద్దీ తీవ్రత పెరిగింది. దాంతో ఆది, సోమవారంలలో పలు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు 08510 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా రాత్రి 10 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08551 విశాఖపట్నం - చర్లపల్లి రైలు ఈ నెల 19న సాయంత్రం 6.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08552 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08550 చర్లపల్లి - భువనేశ్వర్ రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 20వ తేదీ వేకువజామునకు ముందు 2.15కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

వెల్లూరు(స్వర్ణ దేవాలయం), తిరువణ్ణామలై(అరుణాచలం), శ్రీరంగం, మధురై తదితర ప్రాంతాలను సందర్శించే యాత్రికుల కోసం ఈ నెల 23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడపనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. ఈ నెల 23న నంబరు 07175 సికింద్రాబాద్ - కొల్లం, 25న నంబరు 07176 కొల్లం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడుపుతామన్నారు.

కొనసాగుతున్న ట్రెక్కింగ్ క్యాంపు



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్యాడెట్లు

గుంటూరు (విద్య), నరసరావుపేట కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రెక్ 3 కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్ క్యాంపు కొనసాగుతోంది. శనివారం కొండవీడు చెక్‌పోస్టు నుంచి చారిత్రాత్మక కొండవీడు కోట వరకు 7 కి.మీ. ట్రెక్‌లో క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ ట్రెక్ కేవలం క్యాడెట్ల స్థైర్యాన్ని, క్రమశిక్షణను చూపించడమే కాకుండా, ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తెచ్చింది. ట్రెక్ ముగిసిన తర్వాత క్యాడెట్లు రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. కొండవీడు కోట చరిత్ర, ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. రెడ్డివంశ పాలన, కోట ఆర్కిటెక్చర్ పరిశీలించే అవకాశం లభించినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 18 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్నారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. గుంటూరు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 510 మంది విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు.

యడ్లపాడు-1 వీఆర్వో సుభాని సస్పెన్షన్?

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు-1 వీఆర్వో షేక్ సుభాని సస్పెండ్ అయ్యారు. సుభానిపై పలువురు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. భూములకు సంబంధించి రికార్డులు తారుమారు చేయడం, లంచం డిమాండ్ చేయడం, అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడడం వంటి ఆరోపణలతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో తక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామంలో వీఆర్వోగా పనిచేసిన సమయంలోనూ పలు అక్రమాలకు పాల్పడగా అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కొద్ది నెలల సస్పెన్షన్ తరువాత నూజెండ్ల మండలానికి కేటాయించారు. అయితే అప్పటి తహసీల్దార్ అతడిని చేర్చుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో వీఆర్వో బంధువు వైసీపీ నాయకుని సిఫార్సుతో వంకాయలపాడు వీఆర్వోగా డిప్యూటేషన్‌పై వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సుభానిని వేరొక మండలానికి బదిలీ చేయగా అక్కడ చేర్చుకోకపోవడంతో తిరిగి యడ్లపాడు-1 వీఆర్వోగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయితే వంకాయలపాడు వీఆర్వోగా పనిచేసిన సమయంలో పలువురి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడి పనులు చేయకపోవడంతో వారంతా ఫిర్యాదులు చేయడం, విచారణలో నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.



ఉద్యోగావకాశాలు

➾ గుంటూరు సిటీ కొత్తపేట శివాలయం ఎదురు సందులో గల లీలాకార్తికేయ హాస్పిటల్ నందు పనిచేయుటకు PRO మరియు మేనేజర్ కావలెను. సంప్ర॥ 9247862689. AJG-204429

➾ ప్రముఖ విద్యా సంస్థ నందు పని చేయుటకు J.Ls, Wardens, Computer Operators, టెలికాలర్స్, PRO's కావలెను. ఫోన్ నెంబర్ : 83176 01817, విద్యా అర్హతలు : P.G, B.Tech. AJG-204091

➾ బాపట్ల పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేయుటకు యువతి / యువకులు కావలెను. జీతం : 11500 to 13000, Age : 20 To 50. సంప్ర॥ 9394110108. AJG-204430

➾ గుంటూరు సిటీలోని గుజ్జనగుండ్ల సెంటర్ వేణు మెడికల్స్ నందు పనిచేయుటకు (M) సేల్స్ మెన్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ 94906 05375, 6301101910. AJG-204431

➾ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 99899 09698 AJG-204424

➾ ప్రముఖ MNC కంపెనీలో ASO (పోస్టులు-20) మరియు కన్సల్టెంట్ (పోస్టులు-30)గా పని చేయుటకు డిగ్రీ/ఇంటర్ / 10th పాసైన రిటైర్డ్, హౌస్ వైఫ్, పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగులు కావలెను. Ph. No. 9848647051. AJG-204045

➾ గుంటూరు మరియు అద్దంకి సమీపంలో గల కళ్యం టెక్స్‌టైల్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్ M/F కావలెను. ఉచిత వసతి, సబ్సిడీ భోజనం సదుపాయం. వెంటనే సంప్రదించగలరు. సెల్ : 98480 91841, 93461 76356. RK-2491

➾ ఉన్నత కుటుంబానికి చెందిన 58 ఏళ్ళ వ్యక్తికి వంట చేయటానికి ఏ బాదరబందీలేని మహిళా వంట మనిషి కావలెను. సంప్రదించండి సెల్ : 94412 75534 AJB-225711

➾ LIC ఏజెంట్స్, బ్రోకర్స్, రియల్ ఎస్టేట్స్, ఉద్యోగులు ఎవరైనా మాకు రోజూ 1 గంట పని చేసే పార్ట్ టైమ్ ఏజెంట్స్ కావలెను. నెలకు మంచి ఆదాయం. సంప్ర. సెల్ : 9848356777, 9347090425 AJB-225607

➾ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS స్టేట్, సెంట్రల్ ఎంప్లాయిస్, గృహిణులు, టీచర్స్ రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-65 సం.లు, Q. ఇంటర్ + ✆ 99083 98672 AJB- 428

EDUCATION

➾ షార్ట్ టర్మ్ కోచింగ్ ఫర్ EAPCET-2025 (AP&TS), అత్యంత ప్యాకేజీతో విద్యాబోధన. హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801. NAM-353

బోర్ వెల్స్

➾ విజయ బోర్ వెల్స్ : 4-1/2, 6-1/2; 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. సంప్ర॥ గుంటూరు. సంప్ర॥ 98662 22717, 98481 83887. AAA-9664

చెదల నివారణ

➾ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5 సం॥ గ్యారంటీ. AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాన్సర్ పెస్ట్ కంట్రోల్, పట్నం బజారు, గుంటూరు. ఫోన్ : 8978672824, 9848131213 AA-75

లీకేజీ సమస్యలా?

➾ బాత్ రూమ్ లీకేజీ గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్స్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజీస్పైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892 AJG-204425



అమ్మకము

➾ గుంటూరు సిటీ పరిధిలో గల స్టోన్ క్రషర్ అమ్మకానికి కలదు. సంప్రదించండి సెల్ నెంబర్ : 7569879199. AJG-204427

➾ బాపట్ల జిల్లాలో సిమెంట్ (Flyash) & లైట్ వెయిట్ రాళ్ళు తీయడానికి వీలుగా ఉన్న స్థలం లీజ్‌కి ఇవ్వబడును & మెషినరీ అమ్మబడును. సంప్ర॥ 9676991122. AJG-204408

➾ కొండవీడు ఇస్కాన్ టెంపుల్ స్పైసెస్ పార్క్ & AP ప్రభుత్వ ప్రపోజ్ లాజిస్టిక్ పార్క్ కొండవీడు గ్రామాల పరిధిలో గల CRDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర॥ 9052365959. AJG-204008

రియల్ ఎస్టేట్

➾ మంగళగిరి NRI హాస్పిటల్ వెనుక గ్రేటర్ కమ్యూనిటి 2, 3 BHK & 4 BHK లగ్జరీ జిమ్, టాప్ ఫ్లోర్, స్విమ్మింగ్ పూల్, స్పా, సూపర్ మార్కెట్, చిల్డ్రన్ పార్క్‌తో ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్రదించండి. 90520 75666, 91334 56258 AJG-204428

➾ Enrich Construction & Interiors : తక్కువ రేటు - మన్నికైన నిర్మాణం - అదిరిపోయే ఇంటీరియర్స్ మీ కలల ఇంటిని, నిర్మాణ మరియు ఇంటీరియర్స్ రంగంలో 16సం॥ల పైగా అనుభవం కలిగిన, ఇంజనీర్ నిపుణులచే నిర్మించుకోండి. మెటీరియల్ కాంట్రాక్టుతో, Turnkey పద్ధతిలో ఇంటి నిర్మాణం & లేటెస్ట్ సిటీ స్టైల్ ఇంటీరియర్ చేయబడును. Ph: 9676991122 AJG-204409

➾ గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మన్నెం లతీష్ గౌడ్, Ph: 9848986831. SJAA-302

స్థలం అమ్మకము

➾ గుంటూరు నుండి నరసరావుపేట రూట్‌కు 17 కి.మీ.ల దూరంలో రెండు వైపులా తారు రోడ్డుకు ఆనుకొని ప్రపోజ్ ఔటర్ రింగ్‌రోడ్డు 2 కి.మీ.ల దూరంలో 725 గజాల స్థలం కలదు. గజం: 7000 మాత్రమే. సంప్ర॥ 9032380696. AJG-203900

➾ శ్రీ సాయి సదన్, బ్రాడీపేట 4/9 లైను, చ.గ 277-4 (కొలతలు 44 X 56.6 లు) తూర్పు ఫేసింగ్ డోర్ నెం: 5-43-12, Contact : 7675959264 AJG-204432

FLAT FOR SALE

➾ గుజ్జనగుండ్లకు సమీపంలో రత్నగిరి నగర్ రిలయన్స్ వెనుక 2 బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మకం. మెయిన్ రోడ్డుకి దగ్గరలో 7 సం॥ ఓల్డ్, 35L, Ph : 9553 783 239. SJAA-305

➾ సంక్రాంతి ఆఫర్ 45 లక్షలకే 2BHK, 60 లక్షలకే 3BHK, ఫుల్ ఫినిష్డ్ రెడీ టూ ఆక్యుపై, అమరావతి మెయిన్ రోడ్డు ప్రక్కన గోరంట్ల, గుంటూరు. సెల్ : 9701486924. AJG-204407

➾ గుంటూరు పట్టణంలోని బ్రాడీపేట 6/ 13లో ఉన్న 2150 అడుగుల విస్తీర్ణంలో గల త్రిబుల్ బెడ్ రూం ఫ్లాట్ అమ్మబడును. మరిన్ని వివరాలకు సంప్ర॥ సెల్॥ 9908770099 AJO-211417

➾ తాడేపల్లిలో కొత్తగా కన్‌స్ట్రక్షన్ చేయబడ్డ 4 BHK ఫ్లాట్ (4300 Sft) 2nd ఫ్లోర్‌లో, పడమర ఫేస్, 2 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకమునకు కలదు. ✆ 92464 95388 AJB- 438

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

➾ పల్లవి నివాస్, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే గేటు దగ్గర, అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలకే. సంప్ర॥ 9848110543, 8885566086 AJV-4433

PLOT FOR SALE

➾ విజయవాడ హైవే ఫేసింగ్ కుప్పరాపేట దగ్గర, 222 ఎ.లలో మెగా DTCP లేఅవుట్‌లో 5 ఎ.లలో క్లబ్‌తో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు కలవు. Spot రిజిస్ట్రేషన్. ఫోన్: 8500166366, 7036193107 AJH-002901

ఇల్లు అమ్మకము

➾ తెనాలి తాలూకా, దుగ్గిరాల లోని, గణేష్‌పురం తిరుపతమ్మ గుడి వెనుక వైపున 3 సెంట్ల స్థలంలో నిర్మించిన 2 పోర్షన్ల బిల్డింగ్ (ఈస్ట్ ఫేస్) అమ్మకం. సంప్ర : 98488 21475 AJB-225753

అద్దెకు

➾ బృందావన్ గార్డెన్స్ 3వ లైన్ స్పెన్సార్ మార్కెట్ ప్రక్కన తూర్పు ఫేస్ 1st ఫ్లోర్, 15 వెడల్పు X 60 లోతు 900 Sq.F ఇల్లు, ఆఫీస్‌లకు, కమర్షియల్ పర్పస్ అద్దెకు కలదు. సంప్ర॥ 9441033069. AJG-204412

➾ గుంటూరు, చంద్రమౌళి నగర్ 7/1 నగర్‌లో ఉన్న శబరిగిరి టవర్స్ ఎదురుగా ఉన్న ఇల్లు హాస్టల్స్‌కి అద్దెకు ఇవ్వబడును. Ch. రవీంద్రబాబు. సెల్ : 93939 59779, 94906 39429. AJG-204079

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



విశాఖకు రూ.11 వేల కోట్లు ప్యాకేజీ శుభపరిణామం

● మంత్రి అనగాని సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా ప్యాకేజీ ప్రకటించటం శుభపరిణామం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించేందుకు ఆర్థిక సాయం చేసిన ప్రధాన మంత్రి మోదీకి మంత్రి అనగాని కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1గా నిలిపేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని తెలిపారు. త్వరలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు నెలకు రూ.1500 త్వరలో అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ నిర్మాణం తిరిగి ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రాజెక్టుకి కూడా కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. అమరావతి రాజధాని దేశానికే ఒక ఆదర్శం కాబోతుందన్నారు. సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, దండ్రపోలు వెంకటేశ్వరరావు, కొమ్మూరి వెంకటేశ్, రేపల్లె సురేష్, పాపారావు, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

26న తెలుగు నాటకం, స్త్రీవాదంపై సదస్సు



మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు సురేష్‌బాబు, సభ్యులు

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం (వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం, స్త్రీవాదం అనే అంశాలపై సదస్సును ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. శనివారం యడ్లపాడులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం ఇదే తొలిశారనీ, సాధారణంగా మహానగరాలు, పట్టణాలలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యడ్లపాడులో రచ్చబండ సెంటర్‌లోని ముత్తవరపు సురేష్‌బాబు నివాస ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు జరుగుతుందని, తెలుగు నాటకం, సాహిత్యం, స్త్రీవాదం రంగాల్లో అనుభవజ్ఞులైన ప్రముఖులు పాల్గొంటారన్నారు. తెలుగు నాటకం, స్త్రీవాదంపై మహిళల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో నిర్వహించే ఈ సదస్సుకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయులు, పది, ఇంటర్ చదివే విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 300 మంది హాజరవుతారన్నారు. సమావేశంలో వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, సభ్యులు ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

ముడుపులు ఇవ్వలేదని.. ప్రయోజనాలు ఆపారు

● కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగిని ఫిర్యాదు

● చావే శరణ్యమని వేడుకోలు



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి పద్మావతి

గుంటూరు సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ముడుపుల మత్తులో ఉన్న మినిస్టీరియల్ సిబ్బంది శాఖలో పని చేసిన వారిని కూడా పీడిస్తున్నారు. అడిగినంత ఇస్తే సరే, లేకుంటే అంతే అన్న విధానంలో అల్లాడిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన మహిళా ఉదోగిని ఆర్థిక బిల్లుల చెల్లింపు వ్యవహారంలో జరిగిన జాప్యం వైద్య, ఆరోగ్య శాఖ అవినీతికి నిదర్శనంగా నిలిచింది. పి.పద్మావతి వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తూ 2024 ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఉద్యోగ విరమణకు ముందే ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డ్రాయింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అయినా అన్ని బిల్లులు ట్రెజరీలో సమర్పిస్తారని పద్మావతి భావించారు. బాధ్యులైన అధికారుల్లో ఎటువంటి చలనం లేకపోవడంతో బాధితురాలు చాలా పర్యాయాలు ఆస్పత్రికి వచ్చి ప్రాధేయపడ్డారు. విషయాన్ని బాధితురాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. గత తొమ్మిది నెలలుగా ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా బిల్లులను సిద్ధం చేయకపోవడంతో బాధితురాలు శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిశారు. వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డీడీవో గుమ్మడి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌పై ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపు వ్యవహారంలో ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.మూడు వేలు ఇంటి అద్దె కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సత్వరమే న్యాయం జరగకపోతే తనకు చావే శరణ్యం అని బాధితురాలు జిల్లా కలెక్టర్ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం పద్మావతి విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తరువాత కూడా తనను ఎంతగానో వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగినంత ముడుపులు ఇవ్వలేను అన్నందుకు ఇలా వేధించారని అన్నారు.

విస్తరణ పనులు ప్రారంభం



గుంటూరు కార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు నగరంలోని శంకర్ విలాస్ ఆర్.ఓ.బి నిర్మించుటకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరుపున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు శనివారం నుంచి ప్రారంభించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణ పనుల నిమిత్తం చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇస్తామన్నారు.

ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్య

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై చంద్రావతి తెలిపిన వివరాల మేరకు.. దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామానికి చెందిన శృంగారపాటి మురళీకృష్ణ (22) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అదేమండలం చిన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. శుక్రవారం ఉదయం మంగళగిరి ఎయిమ్స్‌లో పని ఉందని చెప్పి వచ్చిన మురళీకృష్ణ స్కూటీపై ఆమెను తీసుకొని బాపట్ల పట్టణంలోని భావన లాడ్జిలో భార్యభర్తలమని చెప్పి రూమ్ తీసుకున్నారు. సూర్యలంక సముద్రతీరానికి వెళ్లి వచ్చారు. అక్రమ సంబంధం వలన మీ కుటుంబ సభ్యులు తిడుతున్నారనీ, ఇకపై రానని ఆమె చెప్పటంతో మనస్తాపానికి గురైన మురళీకృష్ణ బయటకెళ్లి పురుగుమందు తెచ్చుకొని తాగాడు. ఆమె లాడ్జి ఓనర్‌కు చెప్పటంతో అంబులెన్స్ పిలిపించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మురళీకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142,151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

చట్టాలపై ఖైదీలకు అవగాహన

రేపల్లె,జనవరి18(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన వారు సత్‌ప్రవర్తనతో నడుచుకుని వారి కుటుంబాలకు అండగా నిలవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. అక్కడి సౌకర్యాలు, ఆహార సదుపాయాలు, మెడికల్ సదుపాయలు, లీగల్ ఎయిడెడ్ సౌకర్యాలు, ఖైదీల కేసుల వివరాలను పరిశీలించారు. న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి రూపశ్రీ, జైలు సూపరింటెంట్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి ప్రత్యేక అధికారి పద్మ

వేమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పని చేస్తున్న ప్రతి స్థాయిలోని ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి పి.పద్మ అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో మండల, గ్రామాల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో శివన్నారాయణ అధ్యక్షత వహించారు. పద్మ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో సర్వేలు నిర్వహించి ఆయా నివేదికలను ప్రభుత్వానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శేఖర్ పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా రాంబాబు



దివి రాంబాబు

చెరుకుపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అఖిలభారత పద్మశాలీయ చేనేతవిభాగం ప్రధాన కార్యదర్శిగా చెరుకుపల్లికి చెందిన దివి రాంబాబుని నియమించారు. ఈ సందర్భంగా అఖిలభారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగడ్ల స్వామి, కార్యదర్శిగా గంధం జగన్నాథం, రాష్ట్ర పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాంబాబు నియామకంపై పలు గ్రామాల చేనేత నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చట్టాన్ని మరింత వినియోగంలోకి తీసుకురావాలి

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం ద్విదశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి చట్టాన్ని మరింత వినియోగంలోకి తీసుకురావాల్సి ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ అన్నారు. ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు ఆధ్వర్యంలో శనివారం సమాచార హక్కుచట్టం ద్విదశాబ్ది ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శామ్యూల్ జోనాథన్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లాఅధికారులు ప్రతినెల మూడో శుక్రవారాన్ని సమాచార హక్కుచట్టం దినోత్సవంగా పాటించాలని కోరారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఆర్టీఐ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. అనంతరం కవితా సర్వీస్ ఆర్గనైజేషన్ వారు ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీడీపీవో లక్ష్మీపార్వతి, శ్రీనివాస్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బాపట్ల,జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆవిష్కరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా ఉన్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రేపూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు పావులూరి కృష్ణమోహన్, కోశాధికారి పి.రాజు, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మండపాటి ఆంద్రేయ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, జిట్టా శ్రీనివాసరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, పల్లం సరోజనీ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం ప్రమాదకరమని జిల్లా రవాణాశాఖాధికారి టికె.పరందామరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం రవాణా, పోలీసు శాఖలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించటంతో పాటు వాహనచోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరందామరెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా తనిఖీలో పట్టుబడితే రూ.వెయ్యి జరిమాన, మూడునెలలు లైసెన్స్ రద్దు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు డి.రంగారావు, కె.ప్రసన్నకుమారి, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారులు అంకమ్మరావు, సురేష్, రవాణాశాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పిట్టలవానిపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యలేని డ్వాక్రా మహిళలు ప్రభుత్వం నిర్వహించే ఉల్లాస్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డీఎల్‌డీవో చెరుకూరి విజయలక్ష్మి అన్నారు. పిట్టలవానిపాలెం వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యలేని డ్వాక్రా మహిళలు విద్యపై దృష్టి సారించి ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వయోజన విద్యనభ్యసించే పుస్తకాలను డ్వాక్రా మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, జిల్లా కోఆర్డినేటర్లు ప్రసాద్, మనోరంజన్, ఏపీఎం సంతోష్‌కుమార్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలు ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

● మంత్రి అనగాని సత్యప్రసాద్



వేమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం అహర్నిశలు పాటు పడిన, తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి, నటుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఉప్పూడి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో విభిన్న పాత్రలు పోషించి చెరగని ముద్రవేసిన నటుడు ఎన్టీఆర్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. 7వ వార్డులోని ఏకలవ్య కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వవైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతానిమురళీధరరావు, టీడీపీ రాష్ట్రకార్యనిర్వహణ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు జీవి నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గోగినేని పట్టాభిరామారావు, కొమ్మూరివెంకటేశ్,కొసరాజురాము,పిన్నిబోయినచింతారావు,మేకా వెంకటశివరామకృష్ణ,రేపల్లె సురేష్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, ఆగస్టీన్, జయప్రద,వీరవల్లి శివదండ మూడిధరణికుమార్, రామకృష్ణ, ల్యాబ్‌కిషోర్, పంతాని సాయికుమార్ పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పని చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరులో టీడీపీ సీనియర్ నాయకులు, బాపట్ల పార్లమెంటరీ స్థాయి పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం పార్టీశ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు' అన్న నినాదంతో ముందుకు నడిచిన మహామనిషి ఎన్టీఆర్ అని, ఆ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు పార్టీని ముందుకు నడుపుతున్నారన్నారు. పార్టీ నాయకులు డి.సుధాకర్, ఎ.కిషోర్‌బాబు, వి.జయప్రకాష్, ఎం.పసి, కె.రాజేష్, వై.సురేంద్ర, కె.గోపినాథ్ పాల్గొన్నారు.

● మండలంలోని 17 గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. జంపనిలో టీడీపీ మైనారిటీ సెల్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, వరహాపురంలో వేమూరి మురళీకృష్ణ, పోతుమర్రులో కూచిపూడి రవి, చావలిలో డీవీ సుబ్బారావు, పెరవలిలో నాగయ్య, చదలవాడలో కోటేశ్వరరావు, కాకర్లమూడిలో కిషోర్, అబ్బనగూడవల్లిలో రాజేష్, కోడిపర్రులో డానియేల్ అధ్యక్షతన నిర్వహించారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పేదవాడికి పట్టెడన్నం పెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రశంసించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం కొల్లూరు బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, దోనేపూడిలో విగ్రహానికి, భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు, వెల్లటూరులోని విగ్రహాలకు కూడా ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబు, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రామమోహనబాబు, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, యడ్ల జయశీలరావు, బట్టు మల్లికార్జునరావు, కే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● చుండూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వారిలో చైతన్య స్ఫూర్తిని మేల్కొల్పి, తెలుగు జాతి ఖ్యాతి ప్రపంచానికి చాటిన ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. యడ్లపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చుండూరు, వలివేరు, మోదుకూరు, ఆలపాడు, మండూరు, వేటపాలెం, పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు, దుండిపాలెం, మున్నంగివారిపాలెం, కెఎన్‌పల్లి, తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, వీఎస్‌కె ప్రసాద్, కేశం శ్రీనివాసరావు, జొన్నకూటి సాంబశివరావు పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సినీ, రాజకీయ రంగాలలో విశేషంగా రాణించి ప్రజల మన్ననలను పొందిన ఎన్టీరామారావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు వర్ధంతి కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో ప్రభంజనం సృష్టించిన ఆయన తెలుగువాడి విశ్వరూపం వెండి తెరపై రారాజుగా వెలుగొందారన్నారు. ఈ కార్యక్రమంలో బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు తాతా జయప్రకాష్ నారాయణ, మానం విజేత, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, సీనియర్ నాయకులు తోట నారాయణరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, సుజాత, నజ్మారాణి, అల్లం గోపికృష్ణ, భీమా లీలాకృష్ణ, కూచిపూడి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయం వద్ద శనివారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు వర్ధంతిని నిర్వహించారు. కూటమి నాయకులు ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పఠాన్ రాజేష్, భీమా లీలాకృష్ణ, సాదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామంలో జీబీసీ రోడ్డుపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇనగంటి గాంధీ, డీసీ ప్రెసిడెంట్ ఇనగంటి శ్రీకాంత్, భర్తీపూడి సర్పంచ్, అంచట అమరేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ అచంట విజయ్, బూత్ ఇన్‌చార్జి అమర్‌నాథ్, రాజేష్, అచంట రమేష్, ఆకురాతి రాజేశ్వరి, జయంతి, దశరథరామయ్య పాల్గొన్నారు.

● కర్లపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ఐలెండ్ సెంటర్ శనివారం ఎన్టీరామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలకు మాజీ ఎంపీటీసీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ బాజి, ఐటీడీపీ బాపట్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఆట్ల బాలశంకర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

టీడీపీ కార్యాలయంలో..

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు భూపతిరావు, నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరిగుంట దాసు, జనసేన పార్టీ నాయకులు కృష్ణ, చిలకల సురేంద్ర, కన్నయ్య, రాజు, కరిముల్లా, గఫూర్, అజీమ్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వెంకటరమణ హాస్పటల్ రోగులకు పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏట్రావారిపాలెం గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, చీరాల శ్రీనివాసరెడ్డి, వార్డుమెంబరు ఏట్రానాగిరెడ్డి తదితరులు పాల్గన్నారు. నక్కలవారిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, పెదగొల్లపాలెం పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామిలు ఎన్టీఆర్ విగ్రహానికి ఘననివాళులు అర్పించారు.

● పిట్టలవానిపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి అఫ్జల్ ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి, కార్యాలయాలలోని ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నిజాంపట్నం నాగరాజు, టీడీపీ నాయకులు పెనుమెత్స రవివర్మ, పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిరుపేదలకు కూరగాయలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షులు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, టీడీపీబాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాసీం, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, జి.నరసరాజు, ఎన్.నాగరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, బొలగాని నారాయణ, టీడీపీ యువనాయకులు కలకోట కిషోర్‌రెడ్డి, దీనబాబు, పెనుమెత్స రవివర్మ, మంతెన కృష్ణమూర్తిరాజు, దండు శ్రీనివాసరాజు, నీటి సంఘం డీసీ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, సాగునీటిసంఘాల ఛైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, ఆప్కో మాజీ డైరెక్టర్ దివిరాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని నడింపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా టీడీపీ ఉపాధ్యక్షురాలు గోగినేని వసుధ, గూడవల్లి నడింపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు గోగినేని రామాంజనేయులు, తల్పసాయి, గోగినేని సుబ్బారావు పాల్గొన్నారు.

● అమృతలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కూచిపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, యలమంచిలి బాజీ, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, యలవర్తి రఘుబాబు, మాన్యం కృష్ణమూర్తి, తుమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అమృతలూరులో క్రొత్తపల్లి రవీంద్రబాబు, గుత్తికొండ శాంతకుమారి, శరణు శేషగిరి, నార్ల శ్రీను, మోపర్రులో కొడాలి నాగయ్య, కొత్త సాయి, తరుమెళ్లలో బేతాళ కిరణ్, యలవర్రులో మాథ్యూస్, మండల గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు అభిమానులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూడు నాటుసారా బట్టీలు ధ్వంసం

రేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం దిండి అదవల, పరిశావారిపాలెం,యేమినేనివారిపాలెం గ్రామాల్లో శనివారం నాటుసారా కాస్తున్న మూడుబట్టీలను ధ్వంసం చేశామన్నారు. ఆయా పంచాయతీల్లో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా రెండు చోట్ల నాటుసారా తయారీ కోసం ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : కలెక్టర్



గృహనిర్మాణశాఖ, అనుబంధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణశాఖ ద్వారా ఏర్పాటైన కొత్త లేఅవుట్‌లలో అధికారులు మౌలికసదుపాయాలు కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గృహనిర్మాణశాఖ అనుబంధ శాఖల అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన లేఅవుట్‌లలో 40శాతం గృహనిర్మాణాలు జరిగితే రహదార్లు నిర్మిస్తామని చెప్పారు. జిల్లాలో 287 లేఅవుట్‌లు ఉండగా పిఎంఎవై కింద పక్కాగృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 287 లేఅవుట్‌లలో అత్యవసరంగా 195 సిమెంట్ రోడ్లు నిర్మించాలన్నారు. 95 లేఅవుట్‌లలో సురక్షిత తాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా లక్షగృహాల గృహ ప్రవేశాలు జరపాలని రాష్ట్రప్రభుత్వం లక్ష్యాలు ఫిబ్రవరి 12వ తేది నాటికి చేరుకోవాలని ఆదేశించారు.

● పీఎంఏవై కింద ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థికసాయం 2.50 లక్షలకు పెరగటం సంతోషదాయకమన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి కింద జిల్లాలో 3,194 కుటుంబాలను అర్హులుగా గుర్తించినట్లు వివరించారు. గృహనిర్మాణాలు చేసుకునే స్వయం సహాయక మహిళలకు ప్రత్యేకంగా రుణసదుపాయం కల్పించాలని ఆదేశించారు. 14,603 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలనే లక్ష్యానికి కేవలం 4,671 వ్యక్తిగత మరుగుదొడ్లు మాత్రమే పూర్తి చేయటం ఏమిటని ప్రశ్నించారు. నెలరోజులు గడువులో లక్ష్యాలు అధికమించాలన్నారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్దిదారుల సర్వే పూర్తి అయ్యిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 19,787 మంది లబ్దిదారులకు పక్కా గృహాలను 2017వ సంవత్సరంలో ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో 14 వేల మంది లబ్దిదారులు తమ గృహ నిర్మాణాలను పూర్తి చేశారన్నారు. కేవలం ఇద్దరు మాత్రమే నిబంధనలు అధిగమించి అదనపు విస్తీర్ణంలో గృహాలు నిర్మించారని తెలిపారు. మిగిలిన వారంత గృహాలు నిర్మించుకోలేదని వివరించారు. ఈ నివేదిక ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, గృహనిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వర్లు, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.16 కోట్లతో నూతన రోడ్ల నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

నగరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణం ద్వారా పల్లెలు అభివృద్ధి బాట పడతాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని చిన్నమట్లపూడి నుంచి మృత్యుంజయపాలెం వరకు ఏఐఐపీ గ్రాంటు కింద ఒక కోటి పదహారు లక్షల రూపాయలతో శనివారం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, టీడీపీ నాయకులు మునాఫ్, కరిముల్లా పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించండి

● ముఖ్యమంత్రికి ధార్మిక ప్రచారక్ అమ్మయ్య లేఖ

వేమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నూట నలభై నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళాకు 175 నియోజకవర్గాల నుంచి హిందువులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని మండలంలోని కాకర్లమూడికి చెందిన ధార్మిక ప్రచారక్ బొల్లిముంత అమ్మయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఈ లేఖను శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు బుచ్చి రాంప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు అందించి వారి ద్వారా ముఖ్యమంత్రికి పంపాలని కోరారు. రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా విడుదల చేయించాలని ఆ లేఖలో కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చిస్తామని రాంప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారని అన్నారు. ఈ లేఖను పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ కృష్ణతేజకు కూడా అందించినట్లు అమ్మయ్య తెలిపారు.

'స్వచ్ఛ ఆంధ్ర' సాధనకు సమష్టి కృషి : ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరులో స్వచ్ఛమిషన్ ర్యాలీలో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర సాధనకు సమష్టి కృషి అవసరమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రం వేమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఉద్యోగులు, ప్రజలు, మహిళా సంఘాలతో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించి తద్వారా స్వచ్ఛ భారత్‌ను సాధించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవ సరం ఉందన్నారు. ఇందుకోసం ఎవరికి వారే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, వాటికి బదులుగా జూటు, వస్త్ర సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, డీఆర్‌డీఏ పీడీ వి.పద్మ, ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోపీఆర్‌డీ శేఖర్, ఏపీఎం శోభన్, వివిధ శాఖల అధికారులు, పంచాయితీరాజ్, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

● బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి పట్టణాన్ని, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది దేశంలోనే పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రతిమూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ మన ఇంటి నుండే పరిశుభ్రతను మొదలు పెట్టాలన్నారు. ప్రతి ఇంటికి ఒక ఆర్‌ఎఫ్ఐడిని ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రతిరోజు దానిని స్కాన్ చేసి ఎన్నిబక్కెట్‌లు చెత్త ఇస్తున్నారో లెక్కిస్తుందన్నారు. తద్వారా పాయింట్‌లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎక్కువ పాయింట్లు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మనపరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటామన్నారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత అన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, చెన్నుపాటి కిషోర్, కాగిత నాగభూషణమ్మ, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, కూచిపూడి శ్యామసుందర్ పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బావుడా ఛైర్మన్ రాజశేఖర్‌బాబు తదితరులు



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, కమిషనర్ కె.సాంబశివరావు

● రేపల్లె, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని, స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుదామని రేపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.రామలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. రహదారులను ఊడుస్తూ శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారులు, పట్టణ ప్రధాన రహదారుల్లో చెత్త వేయకుండా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని, గృహాల చుట్టూ పరిశుభ్ర వాతావరణం ఉంచుకోవా లని గృహయజమానులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావు మాట్లాడుతూ స్వచ్ఛరేపల్లెగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు,ఛైర్‌పర్సన్ కట్టామంగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు,మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో ని పంచాయతీ కార్యాలయాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవోలు ఎస్వీ రమణ, కె.నరసింహారావు మాట్లాడారు. అనం తరం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, బి.మల్లికార్జున, సర్పంచ్‌లు కిరణ్మయి, విజయలక్ష్మి, ఉపసర్పంచ్ దూళిపూడి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లిలో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సాగునీటిసంఘాల అధ్యక్షుడు గోగినేని రామాంజనేయులు, గ్రామస్తులు కొడాలి రామ్మోహన్‌రావు, కొడాలి తల్పసాయి, గవిని కృష్ణ, వెన్నం కిషోర్ పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్లు ఊడ్చి శుభ్రం చేయించారు. చెత్త ఏరి వేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు జీకే నాయుడు, వాసు, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అప్పికట్లలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది కలిసి అప్పికట్ల, భర్తీపూడి గ్రామాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి అక్కడ జరిగిన సమావేశంలో కార్యక్రమం గురించి పలువురు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, గ్రామకార్యదర్శి అబ్దుల్ ఖాదర్ జిలానీ, సర్పంచ్‌లు రాజేష్, అచంట అమరేష్, నాయకులు అమర్‌నాథ్, విజయ్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా నిర్వహించాలని బాపట్ల డీఎల్‌డీవో చెరుకూరి విజయలక్ష్మి అన్నారు. పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్‌లో మండలస్థాయి అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వివిధశాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరావు, తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, ఏపీవో సుభాషిణి, ఏపీఎం సంతోష్‌కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బాపట్ల బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **బక్కా కొండలరెడ్డి** గారి కుమార్లు 1. **బక్కా వెంకట గోపిరెడ్డి**, 2. **బక్కా వెంకు మహారెడ్డి** గార్ల ఆస్తిని తనఖా పెట్టుకొని **బక్కా వెంకట గోపిరెడ్డి** గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు బక్కా వెంకట గోపిరెడ్డి గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : వర్ధరావుపేట ఓ.డి., బాపట్ల స.డి., మరుప్రోలు వారి పాలెం పంచాయితీలో చేరిన మరుప్రోలు వారిపాలెం గ్రామం తాలూకు డి.నెం. 259/2బలో య 0-11. 1/2సెంట్లున్నూ, డి.నెం. 260/5బలో య 0.07 సెంట్లున్ను వెరసి రెండు నెంబర్లు తాలూకు ఏక ప్రదేశమై నాకు హక్కు కలిగి మీకు విక్రయించిన య 0.18 1/2 సెంట్లుకు హద్దులు : **తూర్పు** : కోట్లపూడి సుబ్బారావు గారి భూమి హద్దు, **దక్షిణం** : బక్కా వెంకట రమణ గారి భూమి హద్దు, **పడమర** : దేవినూతల పోవు రోడ్డు హద్దు, **ఉత్తరం** : లేటు బక్కా పోలిరెడ్డి గారి భూమి హద్దు. ఈ నాలుగు హద్దుల మధ్య గల య 0-18 1/2 సెంట్లు లేక చ.గ. 895.4లు లేక చ.మీ. 752.14చ్లు లేటీ మెరక స్థలము. DOC NO: 2477/2014, S.R.O. బాపట్ల.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బాపట్ల బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... లేటు **కోకి వెంకట రామిరెడ్డి** గారి కుమారుడు **కోకి వెంకట శివరామకృష్ణారెడ్డి** గార్ల ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు **కోకి వెంకట శివరామకృష్ణారెడ్డి** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : బాపట్ల జిల్లా, బాపట్ల రి.డి., (బాపట్ల అర్.డి.), మరుప్రోలు వారిపాలెం పంచాయితీ, మరుప్రోలు వారిపాలెం గ్రామం తాలూకు దస్త్రావేజు దాఖలా డి.నెం. 290/12ఏ దు, రెవిన్యూ వారి 1బి దాఖలా డి.నెం. 290/12బలో మనకు పై విధముగా హక్కుభుక్తములు కలిగిన య. 0-40 సెంట్లులో మీకు దఖలు పరిచిన య. 0-05 సెంట్లు లేక చ.గ. 242లు ఖాళీ స్థలమునకు హద్దులు : **తూర్పు** : పుట్టా ఆదిశేషారెడ్డి గారి భూమి హద్దు, **దక్షిణం** : కోకి శ్రీనివాసరెడ్డి గారికి ఈ రోజున దఖలు పరిచిన భూమి హద్దు, **పడమర** : పంచాయితీ రోడ్డు హద్దు, **ఉత్తరం** : [illegible] పోవు రోడ్డు కొంత, మా తాలూకు [illegible] స్థలం కొంత హద్దు, ఈ నాలుగు హద్దుల మధ్య గల య.0-05 సెంట్లు అక్షరాల ఐదు సెంట్లు లేక చ.గ. 242లు లేక చ.మీ. 203.28చ్లు ఖాళీ స్థలమున్నూ. DOC NO: 10942/2023, S.R.O. బాపట్ల.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **అంద్రాజు కోటేశ్వరరావు** గారి కుమారుడు **అంద్రాజు వెంకట శ్రీనివాసరావు** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు **అంద్రాజు వెంకట శ్రీనివాసరావు** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు డి., రేపల్లె సబ్ డి. యిలాకా, రేపల్లె మండలం, పెనుమూడి గ్రామ పంచాయితీ యేరియాలోని పెనుమూడి గ్రామ డోర్ నెం. 3-40కు గల పెనుమూడి గ్రామ డి.నెం. 127/1బలో య. 2-28ట్లులో మాకు హక్కు గలిగి మీకు విక్రయించిన చ.గ. 466లు స్థలము మరియు అందలి ఆర్.సి.సి. డాబా ఇంటికి సహా గల ఆస్తికి హద్దులు : **తూర్పు** : పంచాయితీ రోడ్డు హద్దు 49 అ.లు, **దక్షిణం** : [illegible] గారి ఆస్తి హద్దు 81 అ.లు, **పడమర** : [illegible] వెంకటేశ్వరరావు [illegible] గోడ మధ్య 53 అ.లు, **ఉత్తరం** : [illegible] వెంకటేశ్వరరావు [illegible] గోడ హద్దు 83.6 అ.లు, ఈ హద్దుల మధ్య చ.గ. 466లు అక్షరాల [illegible] స్థలమునకు సరియగు చ.మీ. 391.44చ్లు స్థలము మరియు అందలి [illegible] పెనుమూడి గ్రామ డోర్ నెం. 3-40కు గల పెనుమూడి గ్రామ పంచాయితీ అసెస్‌మెంట్ నెం. 459కు గల 418 చ.అ.లు విస్తీర్ణంలో గల ఆర్.సి.సి. డాబా ఇల్లు. DOC NO: 3029/2020, S.R.O. రేపల్లె.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

వారెవ్వా.. బాల శాస్త్రవేత్తలు

● వైజ్ఞానిక ప్రదర్శనలో అబ్బురపరిచిన విద్యార్థులు
● జాతీయ స్థాయి పోటీలకు పలు ప్రాజెక్టులు ఎంపిక
● రేపటి నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి ప్రదర్శనలో చోటు

గుంటూరు:



స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్టుతో సందుపాలెం దర్గా, గైడ్ టీచర్ ఎస్‌వీ రామాంజనేయులు


గగన్‌యాన్ ప్రాజెక్టుతో శారదానికేతన్ విద్యార్థిని ఈర్షిత, అనిశాబేగం


సేవ చేసే రోబోట్ నమూనాతో నారాకోడూరు జడ్పీస్కూల్ విద్యార్థిని నజ్మ


గనివి శ్రీనివాసరావు రూపొందించిన అయస్కాంత క్షేత్రాల ప్రాజెక్టు

(బాపట్ల, గుంటూరు(విద్య), దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

వినూత్న ఆలోచనలకు వైజ్ఞానిక సృజన జోడిస్తే అద్భుతాలు సాధించవచ్చని ఆ విద్యార్థులు నిరూపించారు. విజయవాడ వేదికగా ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో జిల్లాకు రెండేసి చొప్పున ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఆయా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఆ ప్రాజెక్టులను ప్రదర్శించిన బాల శాస్త్రవేత్తల ఆలోచనలను పలువురు అభినందించారు. సైన్స్ ప్రదర్శనలతో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సత్తాచాటిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 25 తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయిలో పోటీలకు సిద్ధమయ్యారు. విద్యార్థులు ఈ ప్రాజెక్టుల రూపకల్పన కోసం నెల రోజుల పాటు శ్రమించారు. ప్రదర్శనలో ఉత్తమంగా ఉండాలంటే తొలుత అత్యున్నతమైన ఐడియా కోసం టీచర్లతో కలిసి విద్యార్థులు మేధోమధనం చేశారు. ఇప్పుడు ఈ విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించేందుకు వారికి ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

రైతుల కోసం..

మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్ ప్రాజెక్టును సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాయిరామ్ ధీరజ్, కె.వెంకటేష్ రూపొందించారు. దీని వల్ల రైతులు పురుగుమందులు పిచికారి చేయడం సులభం అవుతుంది. ట్యాంకును ట్రాలీ మీద ఉంచి చేతితో నెట్టడం తద్వారా ఆక్సిలేటర్ మోషన్ అండ్ చైన్ మెకానిజమ్ ద్వారా ఇది ఆపరేట్ అవుతుంది. ఎలాంటి ఇంధనం అవసరం లేకుండానే కేవలం రైతులు చేతితో నెట్టడం ద్వారానే దీనిని వాడుకోవచ్చు. కేవలం రూ.5,000తో దీనిని రైతులకు అందుబాటులోకి తేవచ్చు. పొలాలకు మందుకోసం ఇప్పుడు వాడుతున్న స్ప్రేయర్ల వల్ల రైతుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దీనికి పరిష్కారంగానే ఈ ప్రాజెక్టుని రూపొందించాం.

వాతావరణం అంచనా వేసేలా

స్మార్ట్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టును బాపట్ల మండలం నర్సాయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని జి.ప్రత్యూష రూపొందించారు. దీనితో వాతావరణ పరిస్థితులను అంచనా వేయవచ్చు. రైతులకు ఇదే ఉపయోగపడుతుంది. వెదర్, టెంపరేచర్ సెన్సార్లు దానిలో అమర్చాం. విత్తు నాటింది మొదలు కోతల వరకు ఏ సమయం అనుకూలమో రైతులే స్వయంగా తెలుసుకోవచ్చు. తుఫాన్ల సమయంలో కరెంటు స్థంభాలు పడిపోయి రైతులు చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పరికరం ద్వారా ముందుగానే డిఫాల్ట్ ఉన్న స్థంభాలను గుర్తించి సదరు విభాగాన్ని అలర్ట్ చేయడానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుంది.

సోలార్ స్మార్ట్ హెల్మెట్

ద్విచక్రవాహన ప్రమాదాల్ని నిలువరించేందుకు ముట్లూరుకు చెందిన సందుపాలెం దర్గా గైడ్ టీచర్ వీఎస్ రామాంజనేయులు ఆధ్వర్యంలో సోలార్ స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. ఈ హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యేలా దీనిని రూపొందించాను. మద్యం తాగినా హెల్మెట్‌లో సెన్సార్స్ ద్వారా గుర్తిస్తుంది. కొత్తగా బైక్‌లు విక్రయించే కంపెనీలు ఈ హెల్మెట్‌తో విక్రయిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అంతేకాదు ఈ హెల్మెట్‌కు బ్లూటూత్, సంగీతం వినేలా ఏర్పాట్లు ఉన్నాయి. నావిగేషన్, మొబైల్ చార్జింగ్ కోసం సోలార్ కమ్యూనికేషన్ సిస్టమ్ అందుబాటులో ఉంటుంది. ,

పది విద్యార్థుల కోసం

పదో తరగతి భౌతిక శాస్త్రంలో విద్యుదయస్కాంతత్వం అనే పాఠ్యాంశాన్ని విద్యార్థులు కష్టంగా భావిస్తారు. దీనిని గమనించి జీజీపాలెం జడ్పీస్కూల్ ఉపాధ్యాయుడు గవిని శ్రీనివాసరావు పాఠాలకు సంబంధించిన విషయాలు సులభంగా నేర్చుకునేలా ప్రాజెక్టు తయారు చేశారు. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత క్షేత్రం, సరళరేఖలా ఉన్న విద్యుత్ అయస్కాంత క్షేత్రం, వలయాకారపు తీగచుట్టవల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రం, సాలినాయిడ్ వల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రాలను ప్రాజెక్టు రూపంతో తీసుకు వచ్చి విద్యార్థులకు వివరించే ప్రయత్నం చేశారు.

సేవ చేసే రోబోట్

ఆపద సమయంలో సేవ చేసేలా రోబోట్‌ను నారాకోడూరు జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని నజ్మా రూపొందించారు. రోగులకు ఆహారం, మందులు అందించడానికి వీలుగా ఈ రోబోట్‌ను రూపొందించారు. దివ్యాంగులకు, హోటల్స్‌లో, మాల్స్‌లో ఆహార పదార్థాలు పంపిణీ చేయడానికి ఈ రోబోట్‌ను ఉపయోగించవచ్చు. మనిషి శ్రమను తగ్గించేలా దీనిని రూపొందించారు.

గగన్‌యాన్

ఇస్రో అంతరిక్షంలోకి ముగ్గురితో కూడిన బృందాన్ని పంపిన వివరాలు తెయలిజేస్తూ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎండీ అనిషాబేగం, ఎస్ ఈర్షితలు గగన్‌యాన్ ప్రాజెక్టు రూపొందించారు. ఈ ప్రాజెక్టు గగన్‌యాన్‌కు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం తెలియజేస్తుంది.

ఆస్తమా రోగుల కోసం..

ఆస్తమా రోగులకు అత్యవసర సమయాల్లో శ్వాస అందించేందు కోసం అంబు బ్యాగ్‌ను దాచేపల్లి జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థి ప్రజాపతి దిలీప్ రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రస్తుతం ఆస్మా రోగులకు ఉపయోగపడే కృత్రిమ శ్వాస మిషన్ కొనుగోలు చేయాలంటే రూ.3 లక్షల వరకు వెచ్చించాలి. అయితే కేవలం రూ.3 వేలు వెచ్చించి డ్రిల్లింగ్ మిషన్, పిస్టన్, ప్రజర్ బ్యాగ్ ఉపయోగించి అంబు బ్యాగ్‌ను తయారు చేశారు. ఇది రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.


మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్ ప్రాజెక్టుతో గ్రూపు విద్యార్థులు కె.వెంకటేష్, సీహెచ్‌సాయిరామ్ ధీరజ్, గైడ్ టీచర్ మోహనాంజలి

బాపట్ల:


స్మార్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టుతో ప్రత్యూష, గైడ్ టీచర్ పి. వినీత


దాచేపల్లి: అంబు బ్యాగ్ నమూనాను ప్రదర్శిస్తున్న దాచేపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రజాపతి దిలీప్

అపూర్వ కలయిక

● 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైద్యులు
● జీఎంసీ 1975వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వారంతా గుంటూరు వైద్య కళాశాలలో 1975వ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు. దేశ విదేశాల్లో వైద్యవృత్తిలో రాణిస్తున్నారు. వైద్య విద్యలో ప్రవేశించిన యాభై ఏళ్ల తర్వాత శనివారం వారంతా గుంటూరు వైద్య కళాశాలలో కలుసుకున్నారు. మిత్రులను చూసి పాత జ్ఞాపకాలను తలచుకుని పులకించిపోయారు. శనివారం జింకానా ఆడిటోరియంలో జీఎంసీ 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాటి బ్యాచ్‌కు చెందిన బీవీ విజయ్‌కుమార్, కేవీఎస్ శివకుమార్, ఎన్నారై తేజానంద్‌గౌతమ్ మూల్పూరి, జీ సూర్యప్రకాశ్, ఈశ్వర్, ఇందిరా కుమారి, సుజాత, వై అజిత్‌బాబు, రవిప్రసాద్, పీ ఆదివిష్ణు, ఆదినారాయణలతో పాటు పలువురు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యాభ్యాసం నాటి పాత జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకున్నారు. ఇకపై ప్రతి రెండేళ్లకు ఒకసారి జీఎంసీలో కలుసుకోవాలని తీర్మానించారు. విద్యాబుద్ధులు నేర్పి మంచి వైద్యులుగా ఎదిగేందుకు దోహదం చేసిన తమ నాటి గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కూడా 75వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు కొనసాగుతాయి.


జింకానా ఆడిటోరియంలో 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఐదు నెలల్లో చినకాకాని - గుండుగొలను బైపాసు

● శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన
● ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.20 వేల కోట్ల వరకు నిధులు
● దిశా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చినకాకాని - గుండుగొలను బైపాసు రోడ్డుని ఐదు నెలల్లో పూర్తి చేసి హైదరాబాద్ జాతీయ రహదారిని అమరావతికి అనుసంధానం చేస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశం శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో డాక్టర్ పెమ్మసాని సమీక్షించి పలు సూచనలు అందజేశారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన అండర్ పాస్ బ్రిడ్జీలు 2026 జూలై నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. త్వరలో నందివెలుగు బ్రిడ్జి పనులు మొదలు పెడతామన్నారు. శంకర్ విలాస్ ఆర్‌వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం భూ సేకరణ డీపీఆర్‌ల రూపకల్పనపై అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారుల నిర్మాణం, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు విషయంలో రెండు నెలల లోపు పూర్తి అలైన్‌మెంట్ చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులకు వచ్చే నెల టెండర్లు పిలుస్తామన్నారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ.110 కోట్లతో చేపడతామన్నారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అమృత్ - 2 వాటర్ స్కీమ్‌కు డీపీఆర్‌లు సిద్ధం చేశామని పరిశీలన దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పీఎంజీఎస్‌వై పథకం కింద 12 రోడ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

మూడు నెలలకోసారి సమీక్ష..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాలను ప్రజాప్రతినిధుల, అధికారులతో ప్రతి మూడు నెలలో కొకసారి దిశా సమావేశంలో సమీక్షిస్తామని మంత్రి పెమ్మసాని విలేకర్ల సమావేశంలో తెలిపారు. అసంపూర్తిగా వున్న నందివెలుగు బ్రిడ్జి కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. మరో రూ.30 కోట్లు అయితే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయవచ్చన్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామన్నారు. శ్యామలనగర్ బ్రిడ్జిని రెండు లైన్లకు పరిమితం చేయడం జరిగిందన్నారు. మంగళగిరి, పెదపలకలూరు బ్రిడ్జిలకు డీపీఆర్‌లు పూర్తి అయ్యాయని, వాటిని రైల్వే అధికారులకు పంపామన్నారు. అమృత్ - 2 పథకం కింద రూ.184 కోట్లతో ఒకటి, రూ.25 కోట్లతో మరొక ప్రాజెక్టు చేపట్టే కార్యక్రమంపై సమీక్షించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పరిస్థితిపై సమీక్షించామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.17 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు నిధులు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో షేక్. ఖజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

● కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి


జీవన్‌దాన్ అనుమతి పత్రంతో రమణ యశస్వి, వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి లభించింది. మృతదేహాల నుంచి సేకరించిన కాలేయం మాత్రమే (కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. హ్యూమన్స్ ఆర్గాన్స్ యాక్ట్ 1994, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ 1995 ప్రకారం అనుమతులు జారీ చేసినట్లు వైద్య విద్య సంచాలకుల కార్యాలయం నుంచి శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి అధికారిక సమాచారం అందింది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ల నిర్వహణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రభుత్వ సమగ్రాస్పత్రి వైద్యులు 2023 ఆగస్టులో ట్రస్ట్‌కు రాతపూర్వంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రస్ట్ నుంచి నిపుణులు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాన్ని సందర్శించి తనిఖీలు చేశారు. సర్జికల్, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు అందుబాట్లో ఉండటం, ఇతర సౌకర్యాలు కూడా ఉన్నట్లు గుర్తించడంతో కాలేయ మార్పిడి ఆపరేషన్లకు అనుమతులు లభించాయి. మూడేళ్ల వరకు ఇది వర్తిస్తుంది. త ర్వాత కమిటీ మరోసారి తనిఖీలు చేసి రెన్యువల్ చేస్తేనే, ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కొనసాగుతాయి. జీవన్‌దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించడంతో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణకు వైద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు వైద్యరంగంలో కాలేయ మార్పిడి ఆపరేషన్‌కు రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా ఈ ఆపరేషన్లు చేస్తారు. కాలేయ మార్పిడి కోసం ఎదురుచూసే పేద రోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికే జీజీహెచ్‌లో మూత్రపిండాల మార్పిడి, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కాలేయ మార్పిడి సర్జరీలకూ అనుమతి లభించింది.

కమిటీలపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. వీటిని సరిదిద్దిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సొసైటీల వారీగా సభ్యులను గుర్తించాల్సి ఉంది. కొత్త ఓటర్ల జాబితాల రూపకల్పనలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 168 సహకార సంఘాల్లో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ హయాంలో నిర్వీర్యం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థి కంగా కుదేలైంది. సహకార రంగాన్ని ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రుణాల పంపి ణీలో కూడా అవకతవకలు పెద్దఎత్తున జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని సంఘాల్లో రూ.లక్షల్లో కుంభకోణాలు జరిగినట్లు ఇప్పటికే జరిగిన విచారణల్లో వెలుగు చూశాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరు గార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం కల్పించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో త్రిసభ్య పాలన విధానాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో కమిటీలను ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార సంఘాలు రాజకీయా లకు అతీతంగా పనిచేయల్సి ఉండగా వీటిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వంఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

● పండగకు 250పైనే ఏర్పాటు
● రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
● ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరింది. అధికారులు ముందుగా భావించినట్లుగానే ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ కనిపించింది. పండగకు గుంటూరుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 171 బస్సులను ఏర్పాటు చేశారంటే ప్రయాణికుల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇక కనుమకు తిరుగు ప్రయాణికులు పెద్దగా ఉండరని అధికారులు భావించినా అందుకు భిన్నంగా ప్రయాణికుల జోరు కనిపించింది. దాంతో కనుమ, తరువాత రోజు రెండు రోజులు ప్రయాణికుల రద్దీతో 75 బస్సుల వరకు సమకూర్చారు. పండగకు గుంటూరుకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ నుంచి గుంటూరుకు 171 బస్సులు ఏర్పాటు చేశారు. దాంతో ఆర్టీసీకి రూ.45లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అయితే కనుమ రోజు పెద్దగా రద్దీ ఉండదని భావించినా కనుమ రోజు రాత్రి, తరువాత రోజు రెండు రోజులు అదనంగా 75 బస్సులు ఏర్పాటుచేశారు. తద్వారా మరో రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెబుతున్నారు. కాగా విద్యాసంస్థలు సోమవారం నుంచి పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో శని, ఆదివారాలు రాత్రి గుంటూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారు, వచ్చే వారి రద్దీ ఎక్కువగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇందు కోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చే సేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం

పండగకు వచ్చిన ప్రయాణికులు గుంటూరు నుంచి తిరుగు పయనమయ్యేందుకు శని, ఆదివారం రాత్రులు వెళ్లనున్నారు. ఇందుకోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం.

- జిల్లా ప్రజారవాణాధికారి రవికాంత్


ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

● రూ.84.5 లక్షల విలువైన 1.206 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల దొంగలను అరెస్ట్ చేసిన శ్రీకాకుళం పోలీసులు రూ.84.44 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్రికాయలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు విజయవాడలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. క్రికెట్ కోచింగ్ తీసుకుని రంజీలోకి ఎంపిక కాక, చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతో పాటు రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్టై గతేడాది జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన రాంబాబు, జైలులో పరిచయమైన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెద్ద కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో కలిసి నేరాలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, ఒక తులం బంగారు చైన్ పోయినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును విచారించగా అసలు విషయం బట్టబయలైంది. జిల్లాలో ఏకంగా 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు వారిద్దరూ అంగీకరించారు. వీరి నుంచి రూ.84,44,800 విలువ చేసే 1.206 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకా మరో 250 గ్రాముల బంగారం బ్యాంకులో తాకట్టులో ఉందని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ వివరించారు.